e
ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G), రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

Registered No : APTEL/25/A1201

# గాయత్రి వార్తలు



జాతీయ తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**
గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్: 73860 45673

PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ ఆదివారం 19-10-2025 సంపుటి : 1 సంచిక :123 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-

## హెచ్-1బీ ఫీజుల పెంపు

- ట్రంప్ సర్కార్‌ను కోర్టుకు లాగిన చాంబర్ ఆఫ్ కామర్స్
- హెచ్-1బీ వీసా ఫీజుపై ట్రంప్ సర్కార్‌కు ఊహించని షాక్




- కొత్తగా లక్ష డాలర్ల ఫీజు విధించడం చట్టవిరుద్ధమని దావా

## ఆఫ్ఘన్ ప్రాక్సీ యుద్ధం వెనుక భారత్ ఉంది..




**రెండు దేశాలతోనూ యుద్ధానికి సిద్ధం: పాకిస్థాన్**

భారత్, ఆఫ్ఘనిస్థాన్‌తో రెండు వైపుల యుద్ధానికి సిద్ధమన్న పాక్
సరిహద్దుల్లో భారత్ కవ్వింపు చర్యలకు పాల్పడవచ్చని హెచ్చరిక
తమపై ఆఫ్ఘనిస్థాన్ ప్రాక్సీ యుద్ధం చేస్తోందని ఆరోపణ
తాలిబన్ల నిర్ణయాల వెనుక ఢిల్లీ స్పాన్సర్‌షిప్ ఉందని వ్యాఖ్య
పాక్-ఆఫ్ఘన్ సరిహద్దు ఘర్షణల నేపథ్యంలో మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలు

## ముస్లిం ఓట్లపై ఆశలు వదులుకున్న నితీశ్ కుమార్?..

బీహార్ రాజకీయాల్లో కొత్త వ్యూహం!
జేడీయూ టికెట్ల కేటాయింపులో కీలక మార్పు




101 స్థానాల్లో కేవలం నలుగురు ముస్లింలకే అవకాశం
మైనారిటీ ఓట్లు తమకు పడటం లేదనే నిర్ధారణకు వచ్చిన పార్టీ

# భాజపా నేతలు దిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలి

### పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి..

బీసీ రిజర్వేషన్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించి పంపినా కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది



ఖమ్మం: బీసీ రిజర్వేషన్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించి పంపినా కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయంపై ప్రధానిని కలిసేందుకు సీఎం రేవంత్ లేఖ రాసినా ఆయన సమయమివ్వలేదని చెప్పారు. ఖమ్మంలో భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఈ అంశంలో రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు చొరవ తీసుకుని అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లాలని భట్టి విక్రమార్క కోరారు. ప్రధాని సమయం ఇస్తే.. అఖిలపక్షంతో కలిసి వచ్చేందుకు సీఎం రేవంత్ సిద్ధమని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టిన విషయాన్ని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. బీసీ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించేందుకు భాజపా ఎందుకు అడ్డుపడుతోందని ఆయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై బీసీ సంఘాలు చేపట్టిన తెలంగాణ బంద్ భాజపా వైఖరికి వ్యతిరేకంగా జరుగుతోందన్నారు. దీనికి కాంగ్రెస్ శ్రేణులతో పాటు అందరూ మద్దతు తెలపాలని కోరారు.

## స్థానిక ఎన్నికలు ఎప్పుడు? రెండు వారాల్లో చెప్పండి

- ప్రభుత్వానికి, ఈసీకి తెలంగాణ హైకోర్టు ఆదేశం
- స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టులో విచారణ
- ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో స్పష్టం చేయాలని ప్రభుత్వానికి, ఈసీకి ఆదేశం
- చర్చించి నిర్ణయం చెప్పేందుకు రెండు వారాల సమయం కోరిన అధికారులు
- బీసీ రిజర్వేషన్ల సమస్య వల్లే నోటిఫికేషన్ నిలిపివేశామని కోర్టుకు తెలిపిన ఈసీ
- తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసిన ఉన్నత న్యాయస్థానం




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న సందిగ్ధతపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో రెండు వారాల్లోగా స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీ) ఆదేశించింది. ఈ అంశంపై ప్రభుత్వం, ఎన్నికల సంఘం కలిసి చర్చించుకుని ఒక నిర్ణయానికి రావాలని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు కొట్టివేయడంతో, స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌ను మిగతా..2లో




## రూ.6,000 కోవిడ్ టెస్టును రూ.12కే తెచ్చారు

### హ్యూవెల్ సంస్థపై కేటీఆర్ ప్రశంసలు

- సుల్తాన్‌పూర్ మెడికల్ డివైసెస్ పార్క్‌లో హ్యూవెల్ కొత్త కెమిస్ట్రీ ల్యాబ్ ప్రారంభం
- ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కోవిడ్ సమయంలో టెస్ట్ ధరను భారీగా తగ్గించిన హ్యూవెల్‌ను అభినందించిన కేటీఆర్




## పసిడి పరుగు ఆగట్లేదు.. 2026 నాటికి తులం రూ.1.5 లక్షలు!

- గత ధంతేరాస్ నుంచి ఇప్పటికి 63 శాతం పెరిగిన పసిడి ధర
- అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలతో పెరుగుతున్న డిమాండ్
- యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించవచ్చన్న సంకేతాలు

## మల్లన్న సాక్షిగా నీచ రాజకీయాలు చేశారు

ప్రధాని మోదీపై ఎక్స్‌లో వైఎస్ షర్మిల విమర్శలు
కర్నూలులో మోదీ దీపావళి టపాసు తుస్సుమందన్న షర్మిల
ఏపీకి వచ్చి బీహార్ ఎన్నికల కోసం కాషాయ వేషమంటూ ఎద్దేవా

అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కర్నూలు పర్యటనపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రధాని పర్యటన ఒక "తుస్సుమన్న దీపావళి టపాసు"లాంటిదని ఆమె ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి బీహార్ ఎన్నికల కోసం కాషాయ వేషం కట్టారని, శ్రీశైలం మల్లన్న సాక్షిగా నీచ రాజకీయాలకు తెరలేపారని ఎక్స్ వేదికగా ఆరోపించారు. రాష్ట్ర ప్రజలను మరోసారి ఘరానా మోసం చేశారంటూ మండిపడ్డారు. శ్రీశైలం క్షేత్ర అభివృద్ధి విషయంలో ప్రధాని మోదీకి మిగతా..2లో



# విద్యార్థుల జీఎస్టీ అవగాహన అద్భుతం...

### జీఎస్టీ పోటీల విజేతలతో సీఎం చంద్రబాబు భేటీ

- అభినందించిన సీఎం చంద్రబాబు
- భవిష్యత్తును మార్చేది సంస్కరణలేనన్న ముఖ్యమంత్రి
- 13 జిల్లాల నుంచి ఎంపికైన 17 మంది విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం
- జీఎస్టీ ప్రయోజనాలపై విద్యార్థుల చక్కటి అవగాహన
- సంస్కరణల ఫలాలు అందడానికి సమయం పడుతుందన్న సీఎం





అమరావతి: భవిష్యత్తును మార్చేది సంస్కరణలేనని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' ప్రచారంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లోని విజేతలు శుక్రవారం ముఖ్యమంత్రిని రాష్ట్ర సచివాలయంలో కలిశారు. 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన 17 మంది విద్యార్థినీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలకు సీఎం చంద్రబాబు సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీఎస్టీ సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలను అర్థం చేసుకున్నారా..? మిగతా..2లో

# భారతదేశ పురోగతికి నదులే రహదారులు

### వికసిత్ భారత్ లక్ష్యంలో జలమార్గాలే కీలకమన్న కేంద్రం

- జలమార్గాల అభివృద్ధిపై కేంద్ర మంత్రి సోనోవాల్ వ్యాసం షేర్ చేసిన ప్రధాని మోదీ
- 2014లో 5గా ఉన్న జాతీయ జలమార్గాలు ఇప్పుడు 111కి పెంపు
- పదేళ్లలో 18 నుంచి 145 మిలియన్ టన్నులకు చేరిన సరకు రవాణా
- రివర్ టూరిజంలోనూ భారీ వృద్ధి.. 25 క్రూయిజ్ నౌకలు ఏర్పాటు



ఢిల్లీ: భారతదేశ నదులు కేవలం వారసత్వ చిహ్నాలు మాత్రమే కావని, అవి దేశ ప్రగతికి కొత్త రహదారులుగా మారాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. గత కొన్నేళ్లుగా దేశంలో జలమార్గాలను అభివృద్ధి చేయడం ద్వారా రవాణా, పర్యాటక రంగాలు బలోపేతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ రాసిన ఒక ప్రత్యేక కథనాన్ని ప్రధాని శుక్రవారం తన 'ఎక్స్' సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. "వికసిత్ భారత్ నిర్మాణం దిశగా పునరుజ్జీవం పొందిన మన జలమార్గాలు ఎలా పయనిస్తున్నాయో" వివరిస్తూ సోనోవాల్ ఈ వ్యాసాన్ని రాశారు. ఒకప్పుడు మన దేశంలో నదులే ప్రధాన రవాణా మార్గాలుగా ఉండేవని, రోడ్లపై ట్రక్కుల హవా పెరగకముందే పట్నా, దిబ్రూగఢ్ వంటి ప్రాంతాల నుంచి కోల్‌కతాకు సరుకులు మిగతా..2లో




## బెజవాడ కనకదుర్గమ్మకు రూ.2 కోట్ల ఆభరణాల కానుక

- కనకదుర్గమ్మకు భారీ విలువైన కానుకను సమర్పించిన కీర్తిలాల్ జ్యూయలరీ నిర్వాహకులు
- వజ్రాలతో కూడిన బంగారు ఆభరణాలు చైర్మన్, ఈవోలకు అందజేత

## నితీశ్ కుమార్ నాయకత్వంలోనే ఎన్నికల బరిలోకి దిగుతాం

### బీహార్ ఎన్డీయేలో విభేదాలు లేవన్న కేంద్రమంత్రి అమిత్ షా

నితీశ్ నాయకత్వంలోనే ఎన్నికలు.. కానీ సీఎం అభ్యర్థిపై మెలిక పెట్టిన అమిత్ షా!

ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్నికల తర్వాతే నిర్ణయిస్తామని వెల్లడి



ఢిల్లీ: బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంటున్న తరుణంలో, ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిపై కేంద్ర హెూంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో నితీశ్ కుమార్ నాయకత్వంలోనే కూటమి పోటీ చేస్తుందని స్పష్టం చేసిన ఆయన, మిగతా..2లో

## హెచ్-1బీ ఫీజుల పెంపు

### ట్రంప్ సర్కార్‌ను కోర్టుకు లాగిన చాంబర్ ఆఫ్ కామర్స్

ఢిల్లీ: వలస విధానాలపై దూకుడుగా వ్యవహరించే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఒక సంచలన నిర్ణయానికి ఆయన సొంత దేశంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కొత్త హెచ్-1బీ వీసా దరఖాస్తులపై ఏకంగా లక్ష డాలర్ల (సుమారు రూ.88 లక్షలు) ఫీజు విధించాలన్న ఆయన ప్రతిపాదనను సవాలు చేస్తూ, దేశంలోని ప్రముఖ వాణిజ్య సంస్థ 'యూఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్' న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ మేరకు కొలంబియా జిల్లా కోర్టులో గురువారం దావా దాఖలు చేసింది. ట్రంప్ సర్కార్ నిర్ణయం అమెరికా ఆవిష్కరణలను, పోటీతత్వాన్ని దెబ్బతీసేలా ఉందని, ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని తన పిటిషన్‌లో పేర్కొంది. సెప్టెంబర్ 19న ట్రంప్ జారీ చేసిన ఈ ప్రకటన ఇమ్మిగ్రేషన్, జాతీయత చట్టాన్ని ఉల్లంఘిస్తోందని చాంబర్ ఆఫ్ కామర్స్ ఆరోపించింది. వీసాలపై కాంగ్రెస్‌కు ఉన్న అధికారాన్ని అధ్యక్షుడు అతిక్రమించారని స్పష్టం చేసింది. ఈ వ్యాజ్యంలో హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలతో పాటు వాటి కార్యదర్శులను ప్రతివాదులుగా చేర్చింది. ఈ నిర్ణయంపై చాంబర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నీల్ బ్రాడ్లీ మాట్లాడుతూ, "ఈ భారీ ఫీజు వల్ల స్టార్టప్‌లు, చిన్న, మధ్య తరహా సంస్థలు విదేశీ నిపుణులను నియమించుకోవడం దాదాపు అసాధ్యంగా మారుతుంది" అని ఆందోళన వ్యక్తం చేశారు. అధ్యక్షుడికి విస్తృత అధికారాలు ఉన్నప్పటికీ, కాంగ్రెస్ చేసిన చట్టాలను ఆయన ఉల్లంఘించలేరని చాంబర్ తన వాదన వినిపించింది. హెచ్-1బీ వీసా హోల్డర్లు అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఎంతో మేలు చేస్తున్నారని, వారు కొత్త ఉద్యోగాలు సృష్టించడంతో పాటు అమెరికన్ల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఆవిష్కరణలకు కారణమవుతున్నారని తెలిపింది. ట్రంప్ తాజా నిర్ణయం ఈ ప్రగతిని తారుమారు చేస్తుందని హెచ్చరించింది. ఈ నిబంధన వల్ల అత్యధికంగా నష్టపోయేది భారతీయ నిపుణులే. ఇటీవలి కాలంలో జారీ అయిన మొత్తం హెచ్-1బీ వీసాలలో 71 శాతం భారతీయులవే కావడం గమనార్హం. ఒకవైపు అమెరికా ఇలాంటి కఠిన నిబంధనలు విధిస్తుండగా, మరోవైపు చైనా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులను ఆకర్షించేందుకు 'కే-వీసా' పేరుతో కొత్త వర్క్ పర్మిట్‌ను ప్రకటించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది.

## ముస్లిం ఓట్లపై ఆశలు వదులుకున్న నితీశ్ కుమార్?..

బీహార్: బీహార్ రాజకీయాల్లో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జనతాదళ్ (యునైటెడ్) సంచలన నిర్ణయం తీసుకుంది. దశాబ్దాలుగా తన సెక్యులర్ ఇమేజ్‌ను కాపాడుకుంటూ వస్తున్న ఆ పార్టీ, ఈసారి మైనారిటీ అభ్యర్థుల విషయంలో అనూహ్య వైఖరి ప్రదర్శించింది. ముస్లిం ఓటర్లు తమకు అనుకూలంగా లేరనే భావనతో, వారికి కేటాయించే టికెట్ల సంఖ్యలో భారీగా కోత విధించింది. తాజాగా 101 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్న జేడీయూ, కేవలం నలుగురు ముస్లిం అభ్యర్థులకే టికెట్లు కేటాయించింది. 2020 ఎన్నికల్లో 11 మంది ముస్లింలకు అవకాశం ఇవ్వగా, వారిలో ఒక్కరు కూడా గెలవకపోవడం గమనార్హం. అదే సమయంలో, అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఎంఐఎం పార్టీ ఐదు స్థానాల్లో విజయం సాధించింది. ఈ పరిణామాల నేపథ్యంలో జేడీయూ తన వ్యూహాన్ని మార్చుకున్నట్లు స్పష్టమవుతోంది. భారతీయ జనతా పార్టీ (బీజేపీ)తో పొత్తులో ఉన్నంత కాలం ముస్లిం మైనారిటీలు తమకు ఓటు వేయరనే నిర్ధారణకు జేడీయూ వచ్చినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 2015లో ఆర్జేడీ, కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసినప్పుడు ఏడుగురు ముస్లిం అభ్యర్థులను నిలబెట్టగా, ఐదుగురు విజయం సాధించారు. కానీ, బీజేపీతో కలిసినప్పుడు మాత్రం ఆ ఓటు బ్యాంకు దూరమవుతోందని పార్టీ భావిస్తోంది. ఇటీవల పార్టీ నేతల వ్యాఖ్యలు కూడా ఈ మార్పును బలపరుస్తున్నాయి. "ముస్లింలు ఎప్పుడూ నితీశ్ కుమార్‌కు ఓటు వేయలేదు" అని పార్టీ సీనియర్ నేత లలన్ సింగ్ గతంలో వ్యాఖ్యానించారు. అలాగే, "ముస్లింలు, యాదవుల వ్యక్తిగత పనులు చేయను" అని మరో ఎంపీ దేవేశ్ చంద్ర ఠాకూర్ అనడం వివాదాస్పదమైంది. ఈ వ్యాఖ్యలు పార్టీలోని అసంతృప్తిని సూచిస్తున్నాయి. వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లుకు జేడీయూ మద్దతు ఇవ్వడం కూడా మైనారిటీల విషయంలో పార్టీ తన వైఖరిని మార్చుకుందనడానికి నిదర్శనమని సామాజిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా ఓట్లు రాని పక్షంలో, వారిని ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలకు స్వస్తి పలకడమే మేలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## ఆఫ్ఘన్ ప్రాక్సీ యుద్ధం వెనుక భారత్ ఉంది..

### రెండు దేశాలతోనూ యుద్ధానికి సిద్ధం: పాకిస్థాన్

ఢిల్లీ: భారత్‌తో పాటు ఆఫ్ఘనిస్థాన్‌తో కూడా ఒకేసారి యుద్ధం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామంటూ పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెంచేందుకు భారత్ ప్రయత్నించే అవకాశం ఉందని, తాము ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వ్యూహాలు సిద్ధం చేశామని ఆయన స్పష్టం చేశారు. ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దు వివాదాలు ముదురుతున్న నేపథ్యంలో భారత్‌ను కూడా ఈ వివాదంలోకి లాగుతూ ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఓ స్థానిక టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ... సరిహద్దుల్లో భారత్ కవ్వింపు చర్యలకు పాల్పడే అవకాశాన్ని కొట్టిపారేయలేమని అన్నారు. "రెండు వైపుల నుంచి యుద్ధం వస్తే ఎలా ఎదుర్కొంటారు అన్న అంశంపై ప్రధానమంత్రితో ఏమైనా సమావేశాలు జరిపారా?" అని యాంకర్ అడగగా, "అవును, మా వ్యూహాలు మాకున్నాయి. వాటిని బహిరంగంగా చర్చించలేను. కానీ, ఎలాంటి పరిస్థితులకైనా మేము సిద్ధంగా ఉన్నాం" అని ఆయన బదులిచ్చారు. కొన్ని రోజుల క్రితం కూడా ఖవాజా ఆసిఫ్ ఇలాంటి ఆరోపణలే చేశారు. ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వం తమపై భారత్ తరపున "ప్రాక్సీ యుద్ధం" చేస్తోందని ఆయన ఆరోపించారు. "ప్రస్తుతం ఢిల్లీ కోసం కాబూల్ ప్రాక్సీ (పరోక్ష) యుద్ధం చేస్తోంది. తాలిబన్ల నిర్ణయాల వెనుక ఢిల్లీ స్పాన్సర్‌షిప్ ఉంది' అని ఆయన అన్నారు. పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లో గత వారం రోజులుగా తీవ్ర ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ ఘర్షణల్లో ఇరువైపులా సైనికులు, పౌరులు డజన్ల సంఖ్యలో మరణించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఇరు దేశాలు 48 గంటల పాటు కాల్పుల విరమణకు అంగీకరించాయి. తమ దేశానికి చెందిన తెహ్రీక్-ఏ-తాలిబన్ (టీటీపీ) ఉగ్రవాదులకు ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం కల్పిస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తుండగా, కాబూల్ ఈ ఆరోపణలను ఖండిస్తోంది. ఈ ఉద్రిక్తతల నడుమ పాక్ మంత్రి భారత్‌పై వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## రూ.6,000 కోవిడ్ టెస్టును రూ.12కే తెచ్చారు

### హ్యూవెల్ సంస్థపై కేటీఆర్ ప్రశంసలు

హైదరాబాద్: సామాన్యుడికి ఉపయోగపడని సాంకేతికత, పరిశోధనల వల్ల ప్రయోజనం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో రూ.6,000 ఖర్చయ్యే ఆర్టీపీసీఆర్ టెస్టును కేవలం రూ.12కే అందుబాటులోకి తెచ్చిన హ్యూవెల్ సంస్థ కృషి అద్భుతమని ఆయన కొనియాడారు. తెలంగాణలోని సుల్తాన్‌పూర్ మెడికల్ డివైసెస్ పార్క్‌లో హ్యూవెల్ ఏర్పాటు చేసిన నూతన కెమిస్ట్రీ ల్యాబ్‌ను కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దేశంలో వినియోగించే వైద్య పరికరాల్లో దాదాపు 70 నుంచి 80 శాతం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఈ పరిస్థితిని మార్చి, మన దేశంలోనే తక్కువ ధరకు నాణ్యమైన పరికరాలను ఉత్పత్తి చేయాలనే గొప్ప సంకల్పంతో కేసీఆర్ గారి హయాంలో ఈ మెడికల్ డివైసెస్ పార్క్‌ను ఏర్పాటు చేశాం" అని తెలిపారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, వైద్య ఖర్చులను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన వివరించారు. ఒకప్పుడు రాళ్లు, క్రషర్లతో నిండిన సుల్తాన్‌పూర్ ప్రాంతం నేడు వేలాది మందికి ఉపాధి కల్పించే పారిశ్రామిక కేంద్రంగా మారడం ఎంతో సంతోషాన్నిస్తోందని కేటీఆర్ అన్నారు. కోవిడ్ కష్టకాలంలో టెస్టింగ్ కిట్లకు తీవ్రమైన కొరత, అధిక డిమాండ్ ఉండేదని గుర్తుచేశారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పోర్టబుల్ ఆర్టీపీసీఆర్ కిట్ల వంటి ఆవిష్కరణలతో ప్రజలకు మేలు చేసిన హ్యూవెల్ యాజమాన్యం, శిశిర్, రచన బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. "సామాన్యుడికి ఫలాలు అందించని పరిశోధన వ్యర్థమని కేసీఆర్ గారు మాకు ఎప్పుడూ చెబుతుంటారు. ఆ మాటలను నిజం చేస్తూ హ్యూవెల్ పనిచేస్తోంది" అని అన్నారు. సంస్థ పదవ వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్, "ఇంకో రెండేళ్లలో మేం అధికారంలోకి వస్తాం. వచ్చిన తర్వాత పరిశ్రమలకు మరింత అండగా నిలుస్తాం" అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శాంత బయోటెక్ ఎండీ వరప్రసాద్ రెడ్డి, హ్యూవెల్ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పసిడి పరుగు ఆగట్లేదు.. 2026 నాటికి తులం రూ.1.5 లక్షలు!

ఢిల్లీ: బంగారం ధర రానున్న రోజుల్లో మరింత పెరిగి సామాన్యులకు షాక్ ఇచ్చేలా ఉంది. 2026 నాటికి 10 గ్రాముల పసిడి ధర రూ.1.5 లక్షల మార్కును తాకే అవకాశం ఉందని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ వెంచురా సెక్యూరిటీస్ ఓ నివేదికలో సంచలన అంచనా వేసింది. శుక్రవారం విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం, అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పరిస్థితులు పసిడికి భారీగా కలిసొస్తున్నాయి. గత ఏడాది ధంతేరాస్ (2024) నుంచి ఈ ధంతేరాస్ (2025) నాటికి బంగారం ధరలు ఇప్పటికే ఆకాశాన్నంటాయి. రూపాయి పరంగా చూస్తే సుమారు 63 శాతం, డాలర్లలో అయితే 53 శాతం రాబడిని ఇచ్చింది. గతేడాది ధంతేరాస్ నాడు రూ.78,840గా ఉన్న తులం బంగారం ధర, ప్రస్తుతం రూ.1,28,200కు చేరడం గమనార్హం. ఇదే జోరు కొనసాగితే, 2026 నాటికి అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 5000 డాలర్లకు, దేశీయంగా తులం రూ.1,50,000కు చేరుతుందని నివేదిక స్పష్టం చేసింది. బంగారం ధరల పెరుగుదలకు అనేక అంతర్జాతీయ అంశాలు దోహదం చేస్తున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చని సంకేతాలివ్వడం, కేంద్ర బ్యాంకులు పెద్ద ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేయడం, ఈటీఎఫ్‌లలోకి పెట్టుబడుల ప్రవాహం పెరగడం వంటివి పసిడికి డిమాండ్ పెంచుతున్నాయి. వెంచురా సెక్యూరిటీస్ కమోడిటీస్ హెడ్ ఎన్.ఎస్. రామస్వామి మాట్లాడుతూ, "అమెరికాలో ప్రభుత్వం షట్‌డౌన్‌లో ఉన్నందున ఆర్థిక గణాంకాలు ఆలస్యమవుతున్నాయి. ఈ క్రమంలో, యూఎస్ కార్మిక మార్కెట్‌లో నెలకొన్న ప్రతికూలతల దృష్ట్యా ఫెడ్ ఛైర్మన్ మరోసారి వడ్డీ రేట్లను తగ్గించే అవకాశముందని సంకేతాలిచ్చారు" అని తెలిపారు. మరోవైపు, అమెరికా జాతీయ రుణం 37 ట్రిలియన్ డాలర్లకు చేరడం కూడా ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచుతోందని ఆయన వివరించారు. ఇక చైనా-అమెరికా మధ్య ముదురుతున్న వాణిజ్య యుద్ధం కూడా బంగారం ధరకు రెక్కలు తొడుగుతోంది. అరుదైన భూలోహాల ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించగా, చైనా దిగుమతులపై అమెరికా అదనంగా 100 శాతం సుంకం విధించింది. ఈ పరిణామాలతో పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గుచూపుతున్నారు. ఫలితంగా, గత ఎనిమిది వారాలుగా బంగారం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ధర తగ్గినా కూడా ఇన్వెస్టర్లు దూకుడుగా కొనుగోళ్లు జరుపుతున్నారని నివేదిక పేర్కొంది.

## స్థానిక ఎన్నికలు ఎప్పుడు? రెండు వారాల్లో చెప్పండి

మొదటి పేజి తరువాయి

రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీ) ఆదేశించింది. ఈ అంశంపై ప్రభుత్వం, ఎన్నికల సంఘం కలిసి చర్చించుకుని ఒక నిర్ణయానికి రావాలని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు కొట్టివేయడంతో, స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం ఇటీవల నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా, సుప్రీంకోర్టు కూడా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని చెప్పింది కదా అని హైకోర్టు గుర్తు చేసింది. దీనిపై ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది స్పందిస్తూ, సుప్రీంకోర్టు కేవలం మౌఖికంగా మాత్రమే చెప్పిందని, లిఖితపూర్వక ఆదేశాల్లో ఆ ప్రస్తావన లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల ఆధారంగా నోటిఫికేషన్ ఇచ్చామని, అది చెల్లకపోవడంతోనే నిలిపివేశామని వివరించారు. రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వంతో చర్చించి, స్పష్టత వచ్చిన తర్వాతే కొత్తగా నోటిఫికేషన్ జారీ చేయగలమని తెలిపారు. ఈ ప్రక్రియ కోసం కొంత సమయం అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం, ఎన్నికల సంఘం తరఫు న్యాయవాదులు రెండు వారాల సమయం కోరడంతో, హైకోర్టు అంగీకరిస్తూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఆ లోగా ఎన్నికల తేదీలపై ఒక స్పష్టమైన నిర్ణయంతో రావాలని నిర్దేశించింది.

## బెజవాడ కనకదుర్గమ్మకు రూ.2 కోట్ల ఆభరణాల కానుక

బెజవాడ : బెజవాడ కనకదుర్గమ్మ అమ్మవారికి కీర్తిలాల్ జ్యూయలరీ నిర్వాహకులు రూ. 2 కోట్ల విలువైన ఆభరణాలను కానుకగా సమర్పించారు. వారు నిన్న రాత్రి వజ్రాలతో కూడిన బంగారు ఆభరణాలను అమ్మవారికి అర్పించారు. సూర్య చంద్రుల ఆభరణాలు, ముక్కుపుడక, బులాకీ, బొట్టు, సూత్రాలు, గొలుసు, కంఠాభరణాలు వంటి పలు రకాల నూతన ఆభరణాలను ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ ఈవో శీనానాయక్‌లకు అందజేశారు. మొత్తం 531 గ్రాముల బంగారం, వజ్రాలతో ఈ ఆభరణాలను తయారు చేసినట్లు జ్యూయలరీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ అర్ధాంగి లక్ష్మీ రవి, మాజీ ఎంపీలు గోకరాజు గంగరాజు, కనుమూరి బాపిరాజు, కీర్తిలాల్ జ్యూయలరీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ దంపతులు తదితరులు పాల్గొన్నారు. దుర్గమ్మ దర్శనార్థం వచ్చిన భక్తులు ఈ సందర్భంగా ఆభరణాలను చూసి ఆనందం వ్యక్తం చేశారు.

## మల్లన్న సాక్షిగా నీచ రాజకీయాలు చేశారు

మొదటి పేజి తరువాయి

ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి బీహార్ ఎన్నికల కోసం కాషాయ వేషం కట్టారని, శ్రీశైలం మల్లన్న సాక్షిగా నీచ రాజకీయాలకు తెరలేపారని ఎక్స్ వేదికగా ఆరోపించారు. రాష్ట్ర ప్రజలను మరోసారి ఘరానా మోసం చేశారంటూ మండిపడ్డారు. శ్రీశైలం క్షేత్ర అభివృద్ధి విషయంలో ప్రధాని మోదీకి చిత్తశుద్ధి లేదని షర్మిల విమర్శించారు. "మల్లన్న ఆలయ అభివృద్ధికి ఒక్క రూపాయి అయినా ఇచ్చారా? రూ. 1,657 కోట్లతో పెండింగ్‌లో ఉన్న మాస్టర్ ప్లాన్ మీకు కనిపించలేదా?" అని ఆమె ప్రశ్నించారు. ఉజ్జయిని, వారణాసి కారిడార్ల అభివృద్ధిపై చూపుతున్న శ్రద్ధ శ్రీశైలం మల్లన్న కారిడార్‌పై ఎందుకు లేదని నిలదీశారు. శ్రీశైలం కారిడార్ నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతులు ఇవ్వడానికి ఎందుకు మనసు రావడం లేదని, ఇది మల్లన్నకు చేస్తున్న ద్రోహం కాదా? అని అన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై కూడా షర్మిల పలు ప్రశ్నలు లేవనెత్తారు. 11 ఏళ్ల క్రితం తిరుపతిలో చెప్పిన పాత పిట్టకథనే ప్రధాని మళ్లీ చెప్పారని విమర్శించారు. ఢిల్లీకి, రాష్ట్ర రాజధానికి లింక్ పెట్టారని, కానీ అరకొర అప్పులు ఇస్తే అమరావతి ఢిల్లీతో ఎలా పోటీ పడుతుందని ప్రశ్నించారు. కేవలం అప్పులకు హామీలు ఇచ్చినంత మాత్రాన రాష్ట్రం ప్రగతి పథంలో పరుగులు పెడుతుందా? అని నిలదీశారు. రాజధానికి లక్ష కోట్ల అప్పులు తెస్తే రాష్ట్ర ముఖచిత్రం ఎలా మారుతుందని, ప్రగతి ద్వారాలు ఎలా తెరుచుకుంటాయని ఆమె అన్నారు.

## భారతదేశ పురోగతికి నదులే రహదారులు

మొదటి పేజి తరువాయి

పట్నా, దిబ్రూగఢ్ వంటి ప్రాంతాల నుంచి కోల్‌కతాకు సరుకులు నదుల మీదుగానే చేరేవని సోనోవాల్ గుర్తుచేశారు. "భారత నదులే మన తొలి హైవేలు. కాలక్రమేణా రైలు, రోడ్డు మార్గాలు రావడంతో వాటి ప్రాధాన్యం తగ్గింది" అని ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం, భారత అంతర్గత జలమార్గాల ప్రాధికార సంస్థ (ఐడబ్ల్యూఏఐ) కృషితో ఇప్పుడు నదులకు మళ్లీ పూర్వ వైభవం వస్తోందని సోనోవాల్ వివరించారు. 2014 వరకు దేశంలో కేవలం 5 జాతీయ జలమార్గాలు మాత్రమే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 111కి పెరిగిందని, వీటిలో 32 ఇప్పటికే కార్యకలాపాలు సాగిస్తున్నాయని ఆయన వెల్లడించారు. ఈ మార్పు వల్ల తక్కువ ఇంధన వినియోగం, తక్కువ కాలుష్యం, చౌకైన రవాణా వంటి ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. జలమార్గాల ద్వారా సరకు రవాణాలో అద్భుతమైన పురోగతి కనిపిస్తోందని గణాంకాలతో సహా వివరించారు. 2013-14లో కేవలం 18 మిలియన్ టన్నులుగా ఉన్న సరకు రవాణా, 2024-25 నాటికి 145 మిలియన్ టన్నులకు పెరిగిందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో 2030 నాటికి 200 మిలియన్ టన్నులు, 2047 నాటికి 250 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుందని తెలిపారు. అదే సమయంలో నదీ పర్యాటకం (రివర్ టూరిజం) కూడా వేగంగా అభివృద్ధి చెందుతోందని సోనోవాల్ అన్నారు. దశాబ్దం క్రితం కేవలం 5 క్రూయిజ్ నౌకలు మాత్రమే ఉండగా, ప్రస్తుతం 13 జలమార్గాల్లో 25 క్రూయిజ్ నౌకలు సేవలందిస్తున్నాయని చెప్పారు. గంగా, బ్రహ్మపుత్ర, కేరళ బ్యాక్‌వాటర్స్ ఈ రంగంలో ముందున్నాయని, వారణాసి, కోల్‌కతా, పాట్నా, గౌహతి వంటి టెర్మినళ్లను ఆధునీకరిస్తున్నామని ఆయన తన వ్యాసంలో పేర్కొన్నారు.

## విద్యార్థుల జీఎస్టీ అవగాహన అద్భుతం...

మొదటి పేజి తరువాయి

కలిగే ప్రయోజనాలను అర్థం చేసుకున్నారా..? అని వారిని సీఎం అడిగారు. నిత్యావసరాల్లోని చాలా వస్తువులు సున్నా శాతం, 5 శాతం స్లాబ్ పరిధిలోకి వస్తున్నాయని.. దీని వల్ల చాలా వరకు ధరలు తగ్గుతాయని విద్యార్థులు చెప్పారు. నాటిన కొంత కాలానికి చెట్టు ఫలాలు ఇస్తున్నట్టు... సంస్కరణలను ఇప్పుడు అమలు చేస్తే కొన్ని రోజుల తర్వాత ఆ ఫలితాలు ప్రజలకు అందుతాయని సీఎం వివరించారు. జీఎస్టీ వంటి సంస్కరణలను అర్థం చేసుకుని వాటిపై ఎస్సే రైటింగ్ కాంపిటీషన్లు, పెయింటింగ్, ఉపన్యాస పోటీల్లో పాల్గొనడం... వాటిల్లో విజేతలుగా నిలవడం అభినందించదగ్గ విషయమని ముఖ్యమంత్రి అన్నారు. జీఎస్టీ అంశాలపై విద్యార్థుల అవగాహన ప్రశంసనీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ డబుల్ డెక్కర్ వంతెనలకు బ్రేక్.. మెట్రో రైల్ అభ్యంతరం!

హైదరాబాద్: నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడంతో పాటు, నిర్మాణ వ్యయాన్ని గణనీయంగా తగ్గించేందుకు ప్రతిపాదించిన డబుల్ డెక్కర్ వంతెనల ప్రాజెక్టుకు బ్రేక్ పడింది. ఒకే పిల్లర్‌పై వాహనాల కోసం ఫ్లైఓవర్, దానిపైన మెట్రో రైల్ కారిడార్ నిర్మించాలన్న ఆలోచనను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ తరహా నిర్మాణాలు ఆచరణలో ప్రయోజనకరంగా ఉండవని, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవని స్పష్టం చేస్తోంది. భూసేకరణ వ్యయం, ప్రాజెక్టుల ఆలస్యాన్ని నివారించేందుకు ప్రభుత్వం మెట్రో కారిడార్లు ఉన్న మార్గాల్లో డబుల్ డెక్కర్ వంతెనల నిర్మాణాన్ని పరిశీలించాలని ఆదేశించింది. దీనిలో భాగంగా విప్రో జంక్షన్, మందమల్లమ్మ చౌరస్తా - టీకేఆర్ కాలేజీ మార్గంలో ఈ తరహా నిర్మాణాలు చేపట్టాలని జీహెచ్ఎంసీ భావించింది. అయితే, ఈ ప్రతిపాదనలను హెచ్ఎంఆర్ఎల్ తిరస్కరించింది. నాగ్‌పూర్, జైపూర్ వంటి నగరాల్లో ఇలాంటి వంతెనల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మెట్రో అధికారులు తమ సమావేశాల్లో పేర్కొన్నట్లు సమాచారం. డబుల్ డెక్కర్ నిర్మాణాల్లో మెట్రో స్టేషన్లు చాలా ఎత్తులో నిర్మించాల్సి వస్తుందని, అంత ఎత్తుకు ప్రయాణికులు రాకపోకలు సాగించడం కష్టమవుతుందని హెచ్ఎంఆర్ఎల్ వివరిస్తోంది. అంతేకాకుండా, నిర్వహణ ఖర్చులు కూడా పెరుగుతాయని చెబుతోంది. ఈ కారణాల రీత్యా డబుల్ డెక్కర్ మోడల్ ఆచరణ సాధ్యం కాదని తేల్చిచెప్పింది. హెచ్ఎంఆర్ఎల్ నిర్ణయంతో ఇకపై ఫ్లైఓవర్లు, మెట్రో కారిడార్లను వేర్వేరుగానే నిర్మించనున్నారు. దీనివల్ల రహదారులను 150 నుంచి 200 అడుగుల వరకు విస్తరించాల్సి ఉంటుంది. నగరంలో ప్రాజెక్టుల వ్యయంలో దాదాపు 40-50 శాతం భూసేకరణకే సరిపోతున్న తరుణంలో, ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ ఖజానాపై మరింత భారం పడనుంది. ఖర్చును, సమయాన్ని ఆదా చేస్తుందనుకున్న డబుల్ డెక్కర్ వంతెనల ప్రణాళిక ప్రస్తుతానికి పక్కకు వెళ్లినట్లే కనిపిస్తోంది.

## నితీశ్ కుమార్ నాయకత్వంలోనే ఎన్నికల బరిలోకి దిగుతాం

మొదటి పేజి తరువాయి



ఎన్నికల తర్వాతే ముఖ్యమంత్రి ఎవరనేది నిర్ణయిస్తామని చెప్పి రాజకీయంగా ఆసక్తిని రేకెత్తించారు. బీహార్‌లోని అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల పంపకాలపై విభేదాలు తలెత్తాయని, పార్టీల మధ్య మనస్పర్థలు వచ్చాయని మీడియాలో వస్తున్న వార్తలపై అమిత్ షా స్పందించారు. అవన్నీ నిరాధారమైన కథనాలని, వాటిలో ఎలాంటి నిజం లేదని కొట్టిపారేశారు. కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని, అన్ని మిత్రపక్షాలు ఐక్యంగానే ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభ్యర్థి గురించి అమిత్ షా మాట్లాడుతూ, "నితీశ్ కుమార్ సీఎం అవుతారా? లేదా? అని నిర్ణయించేది నేను కాదు. ప్రస్తుతానికి ఆయన నాయకత్వంలోనే మేము ఎన్నికలకు వెళుతున్నాం. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత బీజేపీ, దాని మిత్రపక్షాలన్నీ కలిసి కూర్చొని తమ నాయకుడిని ఎన్నుకుంటాయి" అని వివరించారు. ఈ వ్యాఖ్యలతో సీఎం అభ్యర్థిపై ఒకరకమైన సస్పెన్స్‌ను కొనసాగించారు. 2020 ఎన్నికల నాటి పరిస్థితులను ఆయన గుర్తుచేశారు. "గత ఎన్నికల్లో జేడీయూ కన్నా బీజేపీ ఎక్కువ స్థానాలు గెలుచుకుంది. ఆ సమయంలో నితీశ్ కుమార్ స్వయంగా ప్రధాని మోదీని కలిసి, బీజేపీ నుంచే ముఖ్యమంత్రి ఉండాలని ప్రతిపాదించారు. కానీ, మేము మిత్రపక్షానికి, సీనియారిటీకి ఎప్పుడూ గౌరవం ఇస్తాం. అందుకే నితీశ్‌ను సీఎం చేశాం" అని అమిత్ షా తెలిపారు. కాగా, బీహార్ అసెంబ్లీ ఎన్నికలు రెండు దశల్లో జరగనున్నాయి. నవంబర్ 6న తొలి దశ, నవంబర్ 11న రెండో దశ పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి గత రికార్డులన్నింటినీ బద్దలు కొట్టి ఘన విజయం సాధిస్తుందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

## వడ్డెర్లకు చేయూతనిచ్చేలా కీలక నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబు

అమరావతి: రాష్ట్రంలో వడ్డెర సామాజిక వర్గానికి ఆర్థికంగా చేయూతనిచ్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. మైనింగ్ లీజుల కేటాయింపులో వారికి 15 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అవసరమైన విధానాన్ని తక్షణమే రూపొందించాలని గనుల శాఖ అధికారులను ఆదేశించారు. సీనరేజి, ప్రీమియం వంటి చెల్లింపుల్లో వారికి 50 శాతం రాయితీ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై పూర్తి ప్రతిపాదనలు సిద్ధం చేసి, తదుపరి కేబినెట్ సమావేశంలో చర్చకు తీసుకురావాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో గనులు, భూగర్భ వనరుల శాఖ, ఉచిత ఇసుక విధానంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వడ్డెర్లకు లీజులు కేటాయించడమే కాకుండా, వారిని ఎంఎస్ఎంఈలుగా ప్రోత్సహించేలా ప్రస్తుత పాలసీలతో అనుసంధానం చేయాలని దిశానిర్దేశం చేశారు. వెనుకబడిన వర్గాలైన వడ్డెర్లకు ఆర్థిక ప్రయోజనాలు కలిగేలా లీజు కేటాయింపు విధానాన్ని రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు. మైనింగ్ లీజుల కేటాయింపుతో పాటు వారు ఎంఎస్ఎంఈలుగా ఎదిగేందుకు కూడా ప్రస్తుతం ఉన్న పాలసీని అనుసంధానించాలని అన్నారు.

### ఉచిత ఇసుకతో ప్రజలకే ప్రయోజనం దక్కాలి

ఇక, ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రజలందరికీ ప్రయోజనం కలగాలని సీఎం స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా ఉచిత ఇసుక సరఫరాను సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వ్యవస్థలో ఉన్న లోపాలను వినియోగించుకుని దుర్వినియోగం చేసే అవకాశం లేకుండా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సీజన్ కోసం 66.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేశామని... ప్రస్తుతం అన్ని స్టాక్ పాయింట్లలోనూ 43 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ చిట్టచివరి వ్యక్తికీ ప్రయోజనం దక్కేలా ఇసుక లభ్యత జరగాలని అన్నారు. ఇసుక లోడింగ్ తో పాటు రవాణాకు అతితక్కువ వ్యయం అయ్యేలా చూడాలని సీఎం సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఇసుక లభ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లోని అన్ని రూట్లలో పెట్టిన సీసీ కెమెరాల నిఘాను మరింత పటిష్టం చేయాలని సీఎం సూచించారు. ఆర్టీజీఎస్ ద్వారా ఉచిత పంపిణీ విధానంపై పర్యవేక్షించాలని సీఎం అన్నారు.

విలువ జోడింపుతోనే అదనపు ఆదాయం

రాష్ట్రంలో లభ్యం అవుతున్న ఖనిజాల విలువపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గనుల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఖనిజాలకు విలువ జోడింపుతోనే అదనపు ఆదాయం వస్తుందని సీఎం సూచించారు. మేజర్, మైనర్ మినరల్స్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3320 కోట్ల ఆదాయార్జనను లక్ష్యంగా పెట్టుకున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గతంతో పోలిస్తే 34 శాతం మేర అదనంగా గనుల శాఖ నుంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మాంగనీస్ లాంటి మేజర్ ఖనిజాల ఉత్పత్తిలో 72 శాతానికి పైగా ఆదాయం వస్తోందని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం ఏపీలో ఉన్న మినరల్ వెల్త్ విలువను అంచనా వేయాలని సూచించారు.

## ప్రజల్లోకి కవిత... అక్టోబర్ 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'జాగృతి జనయాత్ర'

హైదరాబాద్: తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, ప్రభుత్వ హామీల అమలుపై దృష్టి సారించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 'జాగృతి జనయాత్ర' చేపట్టనున్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఈ యాత్ర ప్రారంభం కానున్నట్లు జాగృతి నాయకులు అధికారికంగా వెల్లడించారు. ఈ యాత్రకు సంబంధించిన కార్యాచరణపై చర్చించేందుకు శుక్రవారం రంగారెడ్డి జిల్లా జాగృతి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ భేటీకి రాష్ట్ర నాయకులు కోల శ్రీనివాస్, నరేష్, అర్చన సేనపతి హాజరయ్యారు. యాత్రను విజయవంతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై జిల్లా ముఖ్య నాయకులతో వీరు సమీక్ష నిర్వహించారు. సామాజిక తెలంగాణ సాధన, బీసీ రిజర్వేషన్ల పెంపు, ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీల అమలు వంటి ప్రధాన డిమాండ్లతో కవిత ప్రజల ముందుకు వెళ్లనున్నారని నాయకులు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలతో మమేకమవుతూ... నిరుద్యోగులు, రైతులు, మహిళలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా మహిళా అధ్యక్షురాలు బండారి లావణ్యతో పాటు రాష్ట్ర స్థాయి నేతలు ముస్తఫా, రామకోటి, రాము యాదవ్, నవీన్ గౌడ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## అర్థం చేసుకోలేకపోతే నేనేం చేయాలి

### ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులపై కర్ణాటక సీఎం

కర్ణాటక: కర్ణాటకలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక సర్వేను నారాయణమూర్తి దంపతులు అర్థం చేసుకోలేకపోతే తానేమీ చేయలేనని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సర్వేపై ఆ దంపతులకు కొన్ని అపోహలున్నాయని, ఇది వెనుకబడిన వర్గాల సర్వే అనే అభిప్రాయంతో వారు ఉన్నారని ఆయన వ్యాఖ్యానించారు. కర్ణాటకలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక సర్వేను ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులు తిరస్కరిస్తూ, తమది వెనుకబడిన వర్గాలకు చెందిన కుటుంబం కాదని, ఈ సమీక్షలో పాల్గొనడం వల్ల కమిషన్‌కు లేదా ప్రభుత్వానికి ఎలాంటి ప్రయోజనం చేకూరదని అన్నారు. దీనిపై సిద్ధరామయ్య స్పందించారు. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులు భావిస్తున్నట్లుగా ఇది వెనుకబడిన తరగతుల సర్వే కాదని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ఇది ఏడు కోట్ల జనాభా సర్వే అని ఇప్పటికి ఇరవై సార్లు చెప్పామని అన్నారు. వారు ఏది కావాలంటే అది రాసుకోనివ్వండని, ఈ సర్వే దేని గురించో ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. నారాయణమూర్తి దంపతులు అర్థం చేసుకోకుంటే తానేం చేయగలనని ఆయన ప్రశ్నించారు.

## బుధవారం నుంచి ఏపీలో భారీ వర్షాలు..

ఆంధ్రప్రదేశ్‌లో బుధవారం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఆగ్నేయ బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని, దీని ప్రభావంతో మంగళవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది. తదుపరి 48 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ దక్షిణ మధ్య బంగాళాఖాతం, పశ్చిమ మధ్య బంగాళాఖాతం ప్రాంతాల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని తెలిపింది.దీని ప్రభావంతో బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం శ్రీకాకుళం, విజయనగరం, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసేప్పుడు ప్రజలు చెట్ల క్రింద నిలబడవద్దని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

# గూగుల్ సెంటర్ - పేద విద్యార్థులకు గొప్ప వరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు. యం.సుబ్బయ్య



**శ్రీకాళహస్తి,గాయత్రి వార్తలు:**
**రిపోర్టర్: రంజిత్**

ఒకప్పుడు హైదరాబాద్ నగరంలో హైటెక్ సిటీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్థాపించి పేద విద్యార్థులకు విదేశాలకు పోకుండా మనదేశంలోనే అంటే ఆనాడు మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే బ్రహ్మాండంగా ఉద్యోగాలు ఐటి రంగాల్లో చేసుకోవడం జరిగింది. మరి ఈరోజు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా తన తనయుడు ఐటి శాఖామంత్రి మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రోత్సాహంతో ప్రోద్బలంతో ఈరోజు విశాఖపట్నంలోనే అతిపెద్ద గూగుల్ సెంటర్ ను ఏర్పాటు చేయుటకు ఢిల్లీలో గూగుల్ యాజమాన్యంతో మాట్లాడి గూగుల్ సెంటర్ పెట్టుటకు సన్నాహాలు చేయడం జరిగినది మరి దీనివల్ల 1,33 వేల ఉద్యోగాలు పేద విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు రానున్నట్లు తెలియపరచడం జరిగినది మరి ఆరోజు తండ్రి హైటెక్ సిటీ తెస్తే మరి ఈరోజు తనయుడు నారా లోకేష్ గూగుల్ సెంటర్ ను తేవడం జరిగింది మరి పేద విద్యార్థులందరూ లోకేష్ శుభాకాంక్షలు తెలపడం జరిగింది రానున్న రోజుల్లో యువత భవిష్యత్తుకు మంచి బాట వేసేది తెలుగుదేశం పార్టీ ఎన్డీఏ కూటమిఅని విద్యార్థులందరూ కొనియాడారు.

# శ్రీ కాళహస్తీశ్వరుడిని దర్శించుకున్న ఆర్.టి.ఐ కమిషనర్



**శ్రీకాళహస్తి, గాయత్రి వార్తలు:**
**రిపోర్టర్: మునిరత్నం**

శ్రీకాళహస్తిలో కొలువైన వాయు లింగేశ్వరుడి దర్శనార్థం ఆర్.టి.ఐ కమిషనర్ చావాలి సునీల్ కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు కమిషనర్‌కు ఘన స్వాగతం పలికారు. వారికి ప్రత్యేకంగా స్వామి, అమ్మవార్ల అంతరాలయ దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం వేద పండితులు వారికి వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏ.ఈ.ఓ మోహన్, పర్యవేక్షకులు నాగభూషణం, టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, ఏపీఆర్ఓ రవి, డిప్యూటీ తాసిల్దార్ శ్రీ అనిల్ మరియు వీఆర్ఓ శ్రీ కుమార్ పాల్గొన్నారు.

# కావలిలో జీఎస్టీ 2.0 పై అవగాహన సదస్సు: దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ముఖ్య అతిథి

**గాయత్రి వార్తలు:**



శివాలయం పక్కన ఉన్న ది హ్యాండ్ లూమ్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్, కావలి వారి ఆధ్వర్యంలో జీఎస్టీ 2.0 (GST 2.0) పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ఈ సందర్భంగా జీఎస్టీకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. జీఎస్టీ తగ్గింపు వలన వినియోగదారులకు కలిగే లాభాలను ఆయన ఈ సదస్సులో కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన నరేంద్ర మోడీ మరియు చంద్రబాబులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర"
## కార్యక్రమం పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి





- టి ఆర్ ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ దగ్గర నుండి ఆర్టీసీ డిపో వరకు భారీ సైకిల్ ర్యాలీ..
- టి ఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే , సబ్ కలెక్టర్
- సైకిల్ వాడకంతో పర్యావరణానికి మన ఆరోగ్యానికి మేలు : ఎమ్మెల్యే ఇంటూరి
- విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీలో స్వయంగా సైకిల్ తొక్కిన ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, కూటమి నాయకులతో ప్రతిజ్ఞ చేయించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

**కందుకూరు : గాయత్రి వార్తలు:**

పట్టణంలో "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర" కార్యక్రమాన్ని పురస్కరించుకొని భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ దామెర హిమవంశి మొక్కలు నాటడం జరిగింది. కందుకూరు పట్టణంలోని టి.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్దకు విచ్చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సబ్ కలెక్టర్ శ్రీ దామెర హిమవంశి కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ వంశీ మొక్కలు నాటారు అనంతరం, "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ టి.ఆర్.ఆర్. డిగ్రీ కళాశాల వద్ద నుంచి ఆర్.టి.సి. డిపో వరకు భారీ సైకిల్ ర్యాలీని కొనసాగించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే సబ్ కలెక్టర్ మరియు మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు, విద్యార్థులు ఉత్సాహంగా సైకిల్ తొక్కారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్‌ను స్వచ్ఛ కార్యక్రమంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలని ప్రతినెల మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. దానికి అనుగుణంగా కందుకూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజలు తమ తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కాపాడుకోవాలని, తద్వారా అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో చెట్ల పెంపకం ద్వారా పర్యావరణాన్ని పెంపొందించి, ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే తెలియజేశారు.

సబ్ కలెక్టర్ శ్రీ దామెర హిమవంశీ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నిర్వహించాలని, తద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ర్యాలీ అనంతరం మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, కూటమి నాయకులతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సబ్ కలెక్టర్ శ్రీ దామెర హిమవంశి ప్రతిజ్ఞ చేయించారు.

# దోపిడీకే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ
## వైఎస్సార్‌సీపీ ఇంచార్జి దద్దాల





- కూటమి సర్కార్ పై నిప్పులు చెరిగిన వైసీపీ ఇంచార్జ్ : దద్దాల నారాయణ యాదవ్
- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా సంతకాల సేకరణ

**పామూరు :గాయత్రి వార్తలు:**

నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం ఉచితంగా అందించాలి, ఆయా కుటుంబాల్లోని విద్యార్థులకు కలగా మారిన వైద్యవిద్యను చేరువ చేయాలన్న ఉద్దేశ్యంతో మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి తన హయాంలో 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టారు. అందులో ఐదింటిని పూర్తి చేశారు. ఈలోపు ప్రభుత్వం మారగా ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే 12 మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు సిద్ధమైందని కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ లి మండిపడ్డారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శనివారం పామూరు మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి ఆధ్వర్యంలో వగ్గంపల్లి పంచాయతీ మరియు చెంచిరెడ్డిపల్లి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఇంచార్జి దద్దాల నారాయణ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు తన హయాంలో ఒక్క మెడికల్ కళాశాల అయినా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. వైయస్ జగన్ గారు ఎంతో ఉన్నత ఆశయంతో తీసుకువచ్చిన మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు సిద్ధమయ్యారన్నారు. కూటమి సర్కార్ తీరును నిరసిస్తూ నిర్వహిస్తున్న ఈ ఉద్యమంలో ప్రజలు కూడా సంతకం చేసి సర్కార్ తీరును ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గంగసాని హుస్సేన్ రెడ్డి,గంగసాని లక్ష్మి,రెక్కల అనిత,కల్లూరి రామిరెడ్డి,గట్ల విజయభాస్కర్ రెడ్డి,కటికల వెంకటరత్నం,ఎలిక అచ్చయ్య,గంగిరెడ్డి వెంకట్ రెడ్డి,షేక్ గయాజ్ ,జొన్నలగడ్డ గోవిందయ్య, శ్రీరామ శ్రీనివాసులు,షేక్ షరీఫ్,పిల్లి బాల నాగిరెడ్డి, మద్దులూరి మహేష్,తేలుకుట్ల శ్రీనివాసులు,కోడూరి రామసుబ్బారెడ్డి,పుట్లూరి రవీంద్రారెడ్డి,పాలేటి ప్రేమ్, డబ్బుగోట్టు వెంకటేష్,షేక్ ఖాజా హుస్సేన్,రాచకొండ మహేంద్ర,గొబ్బిళ్ళ శ్రీనివాస్ యాదవ్,షేక్ నాగూర్ భాష,కాకర్ల చక్రిరావు,బాలి బోయిన పిచ్చయ్య, మేకనబోయిన కృష్ణయ్య,బాలి బోయిన మాలకొండ రాయుడు,అంబటి నాగిరెడ్డి,కుమ్మిత రమణయ్య, రాగిపిండి తిరుపతిరెడ్డి,బైరెడ్డి మహేందర్ రెడ్డి, కుమ్మిత వెంకటేశ్వర్లు,దేవిరెడ్డి బాలసుబ్బారెడ్డి,షేక్ చాంద్ బాషా,షేక్ సుభాని,ఎలియాజర్,తాతపూడి జయరావు,గుమ్మళ్ళ వెంకటేశ్వర్లు,రెక్కల సాయిసతీష్ రెడ్డి,తాతపూడి చిన్నయ్య,షేక్ రహంతుల్లా,బత్తుల దుర్గయ్య,షేక్ ఖాజా మస్తాన్, దగ్గుల వెంకటేశ్వర రెడ్డి,చిట్టేటి చిన్న,బుడంగుంట్ల బాలరాజు,పవులూరి ఆదినారాయణ చౌదరి, గుంటుపల్లి సుబ్బరామయ్య చౌదరి,దగ్గుల శ్రీనివాసరెడ్డి,తుపాకుల ఏడుకొండలు, గుంటగాని నాగేశ్వరరావు,బుడంగుండ్ల బాల గురవయ్య, శ్యామన గురుబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు..

# అనుమతులు లేకుండా టపాసులు అమ్మితేకఠినమైన చర్యలు :ఎస్సై ప్రేమ్ కుమార్

**కొండపి : గాయత్రి వార్తలు:**



మండల పరిధిలో అనుమతి లేకుండా దీపావళి టపాసులు అమ్మితే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రేమ్ కుమార్ తెలిపారు కొండపి మండలం మరియు మండల పరిధిలోని దీపావళి మందు గుండు సామాగ్రి అమ్మే వ్యాపారస్తులకు తెలియజేయమటమేమనగా రాబోయే దీపావళి సందర్భంగా ఎవరైనా దీపావళి మతాబులు అమ్మే వ్యాపారము చేయాలి అనుకునేవారు తప్పనిసరిగా లైసెన్స్ పొందవలెను ఈ లైసెన్సు కొండపి సీఐ సర్కిల్ ఆఫీస్ నందు మరియు ఫైర్ డిపార్ట్మెంట్ వారి సహకారంతో లైసెన్స్ పొందగలరు లైసెన్స్ లేనియెడల దీపావళి మందులు అమ్ముతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై ప్రేమ్ కుమార్ తెలిపారు లైసెన్స్ లేకుండా ఎవరైనా దీపావళి మందులు అమ్మితే ఈ ఎస్సై ప్రేమ్ కుమార్ 9121102109 సీఐ సోమశేఖర్ 9121102114 తెలియపరచాలని అన్నారు.

## బాణాసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

**– పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం భీమా నాయక్**

**పామూరు : గాయత్రి వార్తలు:**



దీపావళి పండుగ సందర్భంగా పామూరు సర్కిల్ పరిధిలో బాణాసంచా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం బీమా నాయక్ తెలిపారు. శనివారం పామూరులో దీపావళి సందర్భంగా అనుమతి పొందిన దుకాణాల సముదాయాన్ని సీఐ భీమా నాయక్ స్వయంగా పరిశీలించారు. అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలు నిర్వహించడం లేదా అక్రమంగా బాణాసంచా నిల్వ చేయడం చట్టపరంగా నేరమని ఆయన హెచ్చరించారు. అనుమతులు పొందకుండా వ్యాపారం నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే బాణాసంచా నిల్వ కేంద్రాలు, విక్రయాలు నివాసాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలని అగ్ని ప్రమాదాలు జరిగితే చేపట్టాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకులు అవగాహన కలిగి ఉండాలని దుకాణదారులు తగిన భద్రతా జాగ్రత్తలు పాటించాలని సిఐ ఎం బి మా నాయక్ సూచించారు. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట పామూరు ఎస్సై కిషోర్ బాబు తదితరులు ఉన్నారు.

## ఆర్టీవో ఆధ్వర్యంలో "సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్"లికార్యక్రమమ

**కందుకూరు గాయత్రి వార్తలు:**




కందుకూరు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ద్విచక్ర వాహనం, ట్రాక్టర్ వాహనములతో ర్యాలీ నిర్వహించుట జరిగినది. ఈ కార్యక్రమం ను కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి టీవీయన్ లక్ష్మీ జండా ఊపి ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వారు జిఎస్టి 2.0 విధానాన్ని ప్రవేశపెట్టడం మధ్యతరగతి ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, ఈ విధానం వలన సగటున వాహనంపై ఇంతమునుపు ఉన్న జిఎస్టి 28 శాతం నుండి 18 శాతం తీసుకురావడం వలన ప్రజలు ఎంతో లబ్ధి పొందగలరని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు జీఎస్టీ విధానంపై అవగాహన కల్పిస్తూ బైక్ మరియు ట్రాక్టర్ రాలిని నిర్వహించడం జరిగినదని, అదేవిధంగా మోటార్ సైకిల్ షో రూమ్స్ నందు జీఎస్టీ ద్వారా లబ్ధి పొందిన వారికి కూడా లక్కీ డిప్ ద్వారా గిఫ్ట్స్ అందజేయడం జరిగినదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఎంవిఐ జె.అనిల్ కుమార్, జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ యానాది తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించేదుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి : మండల అభివృద్ధి అధికారి

**కనిగిరి : గాయత్రి వార్తలు:**





వాయు కాలుష్యాన్ని తగ్గించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మండల అభివృద్ధి అధికారి పి. సుజాత అన్నారు. శనివారం మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పొన్నలూరు బస్టాండ్ సెంటర్ నుండి మండల కార్యాలయం వరకు 'క్లీన్ ఎయిర్' అంశంపై సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి డాక్టర్ పి సుజాత మాట్లాడుతూ మొక్కల పెంపకం ద్వారా స్వచ్ఛమైన గాలి అందుతుందని ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం, పెంచడం అలవాటుగామార్చుకోవాలన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం, ఆరోగ్యకరమైన జీవన విధానంపై ప్రజలు అవగాహన కల్గి ఉండి గుడ్డ, నార సంచులను వాడాలని సూచించారు. అనంతరం మండల అధికారులు టిడిపి నాయకులతో కలిసి మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు అనుమాలు సాంబయ్య, టిడిపి సీనియర్ నాయకులు కర్ణ కోటిరెడ్డి మాట్లాడుతూ వాయు కాలుష్య నిర్మూలనలో సైకిల్ వాడకం కీలకమని, వ్యక్తిగతంగా సైకిల్ వాడకాన్ని అలవాటు చేసుకుంటే వాహనాల వలన ఉత్పత్తి అయ్యే కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చున్నారు. ఇది కేవలం పర్యావరణానికి మాత్రమే కాదు, వ్యక్తిగత ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ప్రతి పౌరుడు సైకిల్ వాడకానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సమాజాన్ని శుభ్రంగా, ఆరోగ్యవంతంగా మార్చడంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కాలుష్యాన్ని తగ్గించేలా ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలతో దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారావు, ఏఎంసీ చైర్మన్ కర్ణ తిరుపతమ్మ ,మండల నాయకులు , , మండవ మురళి డిప్యూటీ ఎంపీడీవో శ్రీ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ రవిచంద్రబాబు, అగ్రికల్చర్ ఆఫీసర్ రాము , ఏపీవో సుధాకర్ , పల్లపోతు ప్రసాద్, పల్లపోతు రమేష్ గారు , మురళి ,పంచాయతీ కార్యదర్శి యం.నారాయణ ,పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలు లు,సచివాల సిబ్బంది, , అంగన్వాడి సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి

**సింగరాయకొండ : గాయత్రి వార్తలు:**



పట్టణాలు, పల్లె సీమలు స్వచ్ఛంగా ఉంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పిలుపు నిచ్చారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కొండపి నియోజకవర్గం, సింగరాయకొండలో నిర్వహించిన స్వచ్ఛ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాకల రోడ్డు నుండి కందుకూరు రోడ్డు వరకు నిర్వహించిన సైకిల్ ర్యాలీ ని మంత్రి జెండా ఊపి ప్రారంభించి ర్యాలీ లో పాల్గొన్నారు. మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ, పట్టణాలు, పల్లె సీమలు స్వచ్ఛంగా ఉంచే లక్ష్యంతో ప్రతి నెల మూడవ శనివారం నెలకొక థీమ్ తో స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం జరుగుచున్నదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అన్నీ వర్గాల ప్రజలు పాల్గొని తమ ఇంటిని, తమ వార్డును, తమ గ్రామాన్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. 2015 న దేశ ప్రధాని స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించగా, అప్పటి రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్రంలో ప్రారంభించడం జరిగిందన్నారు. 2019 వరకు రాష్ట్రంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తూ చెత్త నుండి సంపద తయారీ కి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పెద్ద నగరాల్లో చెత్త నుండి విద్యుత్ ను ఉత్పత్తి చేయడం, వాడిన నీటిని రీసైక్లింగ్ చేసి పరిశ్రమలకు వినియోగించడం వంటి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గ్రామాలను, పట్టణాలను స్వచ్ఛంగా ఉంచడంలో ప్రజల భాగస్వామ్యము ముఖ్యమన్నారు. గతంలో ఆరుబయట స్వచ్ఛమైన గాలితో నిద్రించే వారని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ఈ నెల స్వచ్ఛమైన గాలిని పెంపొందించడం అనే థీమ్ తో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సింగరాయకొండలోని ప్రధాన రోడ్డు నిర్మాణానికి 3 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయడం జరిగిందని, త్వరలో టెండర్లు పిలిచి పనులు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. అలాగే చేపల మార్కెట్ ను నవీకరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. రైతు బజారు ఏర్పాటు కు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. త్వరలో సింగరాయకొండలో అన్నాక్యాంటీన్ ను కూడా ప్రారంభించుకోనున్నట్లు మంత్రి తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం జరుగుచున్నదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు సమర్ధవంతంగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటూ పేద ప్రజలకు అండగా ఉంటున్నట్లు మంత్రి అన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆహ్వానిస్తూ ఇటీవల కాలంలో సుమారు 10 లక్షల ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. జిఎస్టిని తగ్గించడం వలన నేడు నిత్యావసర సరుకులు సుమారు పది శాతం మేర తగ్గడం జరిగి ప్రజలకు మేలు చేకూరే పరిస్థితి ఏర్పడిందన్నారు. జీఎస్టీ తగ్గింపు వలన సుమారు 8 వేల కోట్ల రూపాయలు మేర రాష్ట్రానికి ఆర్థిక భారం పడుతున్నప్పటికీ, ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగిందని మంత్రి అన్నారు. పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రులను సన్మానించి వారితో కలసి మంత్రి, అధికారులు ఫోటో దిగారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి డ్వామా పిడి జోసెఫ్ కుమార్, డిపిఓ వెంకటేశ్వర రావు, నియోజకవర్గ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పాకాల బీచ్ ను సందర్శించిన రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్





**సింగరాయకొండ : గాయత్రి వార్తలు:**

పర్యాటకులను మరింత ఆకర్షించేలా, పర్యాటకులకు ఆహ్లాదాన్ని కలిగించేలా పాకల బీచ్ ను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శనివారం మంత్రి డా డోలా బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు తో కలిసి పాకల బీచ్ ను సందర్శించి, సంబంధిత అధికారులతో కలసి బీచ్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పాకల బీచ్ ను అభివృద్ధి చేసేందుకు చేపట్టాల్సిన పనులు, తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి, జిల్లా కలెక్టర్ తో కలసి సంబంధిత అధికారులతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,పర్యాటకులను మరింత ఆకర్షించేలా, పర్యాటకులకు ఆహ్లాదాన్ని కలిగించేలా పాకల బీచ్ ను మరింత అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీ పి రాజాబాబు మాట్లాడుతూ, పర్యాటకులను మరింత ఆకర్షించేలా, పర్యాటకులకు ఆహ్లాదాన్ని కలిగించేలా పాకల బీచ్ ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పరిసరాలు సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. బీచ్ వద్ద మంచి మొక్కలు నాటాలని, పర్యాటకులకు ఆహ్లాదాన్ని కలిగించేలా నిర్మాణాలు జరగాలన్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు, దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేకంగా గదులను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. బీచ్ పరిసర ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాట్లుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ పాకల బీచ్ సమగ్ర అభివృద్ధి కి ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్, పర్యాటక శాఖ అధికారిని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి, జిల్లా కలెక్టర్ తో కలిసి బీచ్ పరిసర ప్రాంతంలో మొక్కలను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ శ్రీమతి కళావతి, జిల్లా పరిషత్ సిఈఓ శ్రీ చిరంజీవి, డిపిఓ శ్రీ వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వర రావు, మత్స్య శాఖ జేడి శ్రీనివాస రావు, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ శ్రీ బాల శంకర రావు, సిపిడిసిఎల్ ఎస్ఈ శ్రీ వెంకటేశ్వర రావు, పర్యాటక శాఖ అధికారి శ్రీమతి శ్రీరమ్య, ఆర్టిసి ఆర్ఎం శ్రీ సత్యనారాయణ రావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వాయు కాలుష్యాన్ని తగ్గించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు.

**గాయత్రి వార్తలు:**





రోజువారీ కార్యక్రమాలలో ఈ దిశగా దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. " స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర " కార్యక్రమంలో భాగంగా ప్రతినెలా మూడవ శనివారం ప్రత్యేక ఇతివృత్తంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా ఈనెల ' క్లీన్ ఎయిర్ ' ఇతివృత్తంతో ఈ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రకాశం భవనంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాయు కాలుష్యాన్ని నివారించేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను అనుసరించాలని సూచించారు. కార్యాలయాలకు, ఇతర అవసరాల కోసం బయటకు వెళ్లేవారు దగ్గరలో అయితే నడుచుకుంటూ లేదా సైకిల్ తొక్కుకుంటూ వెళ్లాలని పిలుపునిచ్చారు. దూరమైతే వ్యక్తిగత వాహనాలు కాకుండా ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. తద్వారా పర్యావరణంలో వాయు కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నాలలో భాగస్వాములు కావాలని ప్రజలకు కలెక్టర్ పిలుపునిచ్చారు. వాహనాల ద్వారా వచ్చే వాయు కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు మరోవైపు మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు అని అన్నారు. కలెక్టర్ తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, మహిళా ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు కూడా కలెక్టరేట్లో మొక్కలు నాటారు. వాయు కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకునేలా బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి.చిన ఓబులేసు, డీఈవో కిరణ్ కుమార్, సిపిఓ సుధాకర్ రెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి ఆయేషా బేగం, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పద్మ, కలెక్టరేట్ పరిపాలన అధికారి రవికుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**కాలినడకన కలెక్టర్ !**

పర్యావరణాన్ని కాపాడుకోవడానికి వాయు కాలుష్యాన్ని తగ్గించేక్రమంలో ఇతర అధికారులకు, సిబ్బందికి ఆదర్శంగా నిలిచారు కలెక్టర్ రాజా బాబు. తన నివాసం నుంచి కలెక్టరేటుకు కారులో కాకుండా నడుచుకుంటూ వచ్చారు.